క్లుప్తంగా

బోనాల నిర్వహణకు ఏర్పాట్లు



కోట మైసమ్మ ఆలయం వద్ద సమావేశమైన నిర్వాహకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లో వచ్చేవారం బోనాలు ఉండటంతో ఆదివారం కోట మైసమ్మ ఆలయం వద్ద నిర్వాహకులు సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. కోట మైసమ్మ, పోచమ్మ దేవాలయాలకు రంగులు అద్దడం, సౌండ్ బాక్సులు, విద్యుద్దీపాలు అలంకరించడం, భక్తులకు కల్పించే వసతుల గురించి మాట్లాడారు. స్థానికులతో పాటు పోలీసులతో కలిసి బందోబస్తు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు భీమిడి జంగారెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, సామ సంజీవ రెడ్డి, గుర్రం మల్లారెడ్డి, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, బల్వంత్, ప్రభాకర్, లోకం, మహిపాల్, గౌరసాయి, సంతోష్, జగదీశ్, దర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నవయుగ యూత్ అధ్యక్షుడిగా కాశీనాథ్‌రెడ్డి



కాశీనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న స్థానిక నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ నవయుగ యూత్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా అర్కల కాశీనాథ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కాశీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, జిల్లెల దామోదర్‌రెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, జంగయ్య యాదవ్, సిద్దాల కృష్ణ, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మండల అధ్యక్షుడు గూడ వీరేశ్



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొనాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇళ్లు, నూతన రేషన్‌కార్డుల మంజూరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంలో ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో అర్హుల ఎంపికలో ఎలాంటి వివక్షత లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అందించే సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో కర్రెడ్ల నర్సింహారెడ్డి, గ్యార సురేష్, సొప్పరి జంగయ్య, రాజశేఖర్, శ్రీనివాస్, జంగయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని నక్కలపల్లి తాజా మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నక్కలపల్లిలో చేవెళ్లలోని లలిత ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి.. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్వర్‌రెడ్డి, బోజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అంజయ్యగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కందుకూరు: బోనాల ఊరేగింపు



పహాడీషరీఫ్: పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

బోనం.. ఘనం

మహేశ్వరం నియోజకవర్గంలో ఆదివారం ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో ప్రజలు బోనాలు తయారుచేసి డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు తరలిరావడంతో పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసుల బందోబస్తు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: బోనంతో జేపీసీ చైర్మన్ కపిల్‌గౌడ్ దంపతులు



మహేశ్వరం: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు



తుక్కుగూడ:రావిర్యాలలో అమ్మవారి ఘటం ఊరేగింపు



తుక్కుగూడ: ఘటం ఊరేగింపులో కళాకారుల నృత్యాలు



మహేశ్వరం: ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

బ్రైటర్‌మైండ్ శిక్షణకు విశేష స్పందన



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ శిక్షకులు

కొత్తూరు: పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం శ్రీరామచంద్రమిషన్ కన్హశాంతివనం, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకులు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన బ్రైటర్‌మైండ్ శిక్షణకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే బ్రైటర్‌మైండ్‌లో శిక్షణ పొందిన పలువురు చిన్నారులు కళ్లకు గంతలు కట్టుకొని పలు వస్తువులు, వాటి రంగులను చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది. అంతేకాకుండా ఇతరులు కాగితంపై గీసిన పలు చిత్రాలను వీరు కళ్లకు గంతలతోనే గుర్తించి కొద్దిగా తేడా లేకుండా తిరిగి వాటిని గీశారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ.. స్పర్శ, శబ్దం, వాసనతో మెదడు మూడో నేత్రంగా పని చేస్తోందన్నారు. చిన్న వయస్సు నుంచే బ్రైటర్‌మైండ్‌ను సాధన చేయడంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. పట్టణంలోని గ్రంథాలయంలో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు పెద్దలకు ధ్యాన ప్రక్రియ సాధనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సభ్యుడు అమర్, శిక్షకులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు అన్యాయం

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, 33 శాతం ఉన్న రిజర్వేషన్లను 23కు తగ్గించిందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు గుండె రాణి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ తగ్గించిన బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ 23 నుంచి 42 శాతానికి పెంచిదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను పెంచితే జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తన మూలంగానే రిజర్వేషన్లను ప్రభుత్వం పెంచిందనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినట్టే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిత్యం ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ కవిత ఇంట గెలిచి బయట గెలిచేందుకు కష్టపడాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉంటే మొదటి నాలుగేళ్ల వరకు జాగృతి పనిచేసిందని, తర్వాత ఎందుకు కనుమరుగు అయిందో ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రజలకు తెలపాలన్నారు. అనంతరం రాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో అనసూయ, అరుణ, సుజాత, కళమ్మ, అస్మా, లలిత, సువర్ణ, లక్ష్మీ, మణేమ్మ, నర్సమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాల

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



ఫిట్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి రోజు విధిగా వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆల్ఫా ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా శారీర దృఢత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని, వ్యాయామం జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు చెన్నయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

సీఎంను విమర్శించడం తగదు

మహిళా కాంగ్రెస్ నేతల ధ్వజం

షాద్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ కవిత విమర్శించడం తగదని పట్టణ మహిళా కాంగ్రెస్ నేతలు నాగమణి, వజ్రమ్మ, చంద్రకళ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతోందన్నారు. మహిళలకు 500లకే సిలిండర్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు వంటి పథకాలను చేపట్టారన్నారు. ఈ పథకాలన్నీ ఎమ్మెల్సీ కవితకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మద్యం దందా చేసి మహిళా లోకం తలదించుకునేలా చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ మహిళల కోసం ఎలాంటి పథకాలు చేపట్టారో కవిత ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్ కులగణన చేపట్టి రిజర్వేషన్లు తీసుకొస్తే అది తానే సాధించానని చెప్పుకోవడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కవితకు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బస్తీ వాసులు

నాగోలు: మోహన్‌నగర్ బస్తీలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మోహన్‌నగర్‌లో బస్తీలో పర్యటించగా వివిధ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బోనాల సందర్భంగా గుంతలు మారిన రోడ్లకు మరమ్మతు చేయించాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ సింగ్, రాజ్‌కుమార్ సింగ్, చుక్కయ్య, గోవర్ధన్, జంగయ్య, దినేష్, సుబ్బారావు, మంచి రాజేష్, రామకృష్ణ, రాకేష్, వెంకట్ రెడ్డి, గట్టు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

షాబాద్: విద్యార్థిపై బూటు కాలుతో తన్ని, చితకబాదిన హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలన్నారు. 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని రాకేశ్‌ను తరగతి గదిలో బంధించి బూటు కాలుతో తన్నడం సరికాదన్నారు. గతంలో హెచ్‌ఎంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, ఎస్ఎంసీ నిధులను కూడా ఆయన పక్కదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిపై దాడి చేసిన విషయమై డీఈఓకు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఆతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కుమ్మర్ల తొలి బోనాల ఉత్సవం



పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామ కుమ్మర్ల తొలి బోనాల ఉత్సవాలు ఆదివారం మన్సూరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్దగౌని లక్ష్మీప్రసన్న బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి రాంచందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మన్సూరాబాద్ గ్రామంలోని కుమ్మరి సంక్షేమసంఘం భవనం నుంచి పోచమ్మ దేవాలయం వరకు పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలతో కుమ్మరులు బోనాలతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాంపల్లి హనుమంతు, ఉత్సవ కమిటీ చైర్మన్ నాంపల్లి మల్లేష్, నాంపల్లి శంకరయ్య, బాలరాజు, వెంకటేష్, నాగేష్, గణేష్, నర్సింహ్మా, మహేష్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ రోడ్డును విస్తరించాల్సి ఉంది

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: రాబోయే తరాల అవసరాల దృష్ట్యా మన్సూరాబాద్ రోడ్డును (బిగ్‌బజార్ చౌరస్తా నుంచి సుష్మా చౌరస్తా వరకు) విస్తరించాల్సిన అవసరం ఉందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధి కాస్మోపాలిటన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు నాణ్యతతో చెక్కు చెదరకుండా ఉన్నాయని, నేడు ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు కొన్ని రోజులకే పాడైపోతున్నాయన్నారు. కాలనీలో ఉన్న విశాలమైన స్థలంలో కమ్యూనిటీహాల్, ఆటస్థలం ఏర్పాటుకు గతంలోనే ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర లక్ష్మినర్సింహా, శ్రీకాంత్, గంజి సత్తయ్య, శ్రీనివాస్, భాస్కర్, గోపాల్, రమేష్, జ్ఞానేశ్వర్, నాయకులు జగదీష్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

వానొస్తే ఇంటికే!

- శిథిలావస్థలో కర్మన్‌ఘాట్ ప్రాథమిక పాఠశాల భవనం
- భయంగుప్పిట్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వర్షం రావడంతో తరగతి గదిలోకి చేరిన నీరు(ఫైల్)

చంపాపేట: శిథిలావస్థలకు చేరిన ప్రభుత్వ పాఠశాలలతో విద్యార్థులు భయం గుప్పిట్లో పాఠాలు వినాల్సి వస్తోంది. ప్రభుత్వాలు..ప్రజాప్రతినిధులు మారుతున్నా వారిచ్చిన హామీలన్నీ నీటిమీద రాతల్లా మారుతున్నాయే తప్ప పాఠశాల భవన పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవటంతో ఎప్పుడు కూలుతాయోనని భయాందోళనకు గురవుతున్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ క్రాంతి యువజన సంఘ కార్యాలయ ఆవరణలో నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం జెడ్పీ నిధులతో నాలుగు తరగతి గదులతో భవన నిర్మాణం చేపట్టారు.

నామమాత్రంగా మరమ్మతు

పాఠశాల భవనం నిర్మింనప్పటి నుంచి ఇప్పటి వరకు భవన మరమ్మతులు, నిర్వహణ కోసం ప్రభుత్వం మన బస్తీ..మన బడి పేరున నామమాత్రం నిధులు మంజూరు చేసి పాఠశాల గోడలకు రంగులు, తరగతి గదిలో పెచ్చులూడిన స్లాబ్ మరమ్మతు మాత్రం చేసి చేతులు దులుపుకున్నారు. గత ఎనిమిది సంవత్సరాల క్రితం పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాల సమీపంలోనే మరో భవన నిర్మాణం చేపట్టి ఆ భవనంలో 1–2 తరగతి వరకు విద్యాబోధన సాగిస్తుండగా.. శిథిలావస్థలో ఉన్న పురాతన భవనంలో 3–5 తరగతి విద్యార్థులకు బోధన సాగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంతో ఏ క్షణాన ప్రమాదం సంభవిస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలన్నీ దుర్గంధమే..

పాఠశాల పరిసరాలలో స్థానిక కాలనీ వాసులు, శానిటేషన్ సిబ్బంది, వారాంతపు కూరగాయల చెత్తను డంపింగ్ చేయటంతో ఆ ప్రాంతం దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారాయి. అది చాలదన్నట్లు పాఠశాల పరిసరాలు శానిటేషన్ నిర్వహణ లేకపోవటంతో తమ పిల్లలు ముక్కుపుటలు అదిరే దుర్గంధం, దోమలు, ఈగలు, పందుల స్వైర విహారం నడుమే విద్యాభ్యాసం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి నూతన తరగతి గదులు ఏర్పాటు చేయాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



ఫ్యాన్ పరిస్థితి

ఉన్నతాధికారులు స్పందించాలి



దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాఠశాల భవనానికి కొంత మేర మరమ్మతు చేపట్టినప్పటికీ పురాతన భవనం కావటంతో శిథిలావస్థకు చేరింది. లోతట్టు ప్రాంతంలో పాఠశాల భవనం ఉండటంతో చినుకు పడ్డా తరగతి గదుల్లోకి వరద నీరు చేరుతుంది. వారం పాటు గోడల నుంచి నీరు కారుతుంది. చినుకు పడితే లాంగ్ బెల్లే. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి.

– యాబీ ఆనంద్‌నాయుడు, చంపాపేట